



# ఫ్రీడం ఫైటర్

• ప్రభాకర్ జైని •

"**ధూ**త్! చలన్నం ఎవ్వడ్ తింటడు" అని విసుక్కున్నాడు శేఖరయ్య డైనింగ్ టేబుల్ ముందునుంచి లేచి విసురుగా కుర్చీని తోసేసి.

"నీయమ్మ!! నేను రోజు పొయ్యేదే నాయె. గీ టైంకు గింతన్నం వేడి వేడిగ వొండితే ప్రానం బోతదా?" అంటూ తల మీది నుంచి ఖద్దరు లాల్చీ తొడుక్కుంటూ అరిచాడు.

రెండేళ్ల క్రితం వరకు శేఖరయ్య అలా మాట్లాడక పోయేవాడు. కొడుకులు, కొడళ్లు అతన్ని చాలా హీనంగా చూసేవారు. శేఖరయ్య అన్నీ భరిస్తూ , ఆ మాత్రం ఆసరా దొరకడమే చాలునన్నట్టుగా, అన్నీ భరించి పడి ఉండేవాడు.

కానీ కొంత కాలంగా, ఇంట్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అతని విసుర్లకు, గొణుగుడుకూ ఎవరూ ప్రతిస్పందించలేదు. అతను పెద్ద పెద్ద అంగలేసుకుంటూ విసురుగా బయటికి నడిచిన తర్వాత, ఆ ఇంటి పెద్ద కోడలు నిర్వికారంగా అతనొదిలేసిన చలన్నం ప్లేటును తీసింది. అప్పటికి టైం - ఉదయం ఏడున్నరే.

అదో మధ్యతరగతి కుటుంబం. శేఖరయ్య యజమాని కాని యజమాని.

ఎందుకంటే ఇంటి పెత్తనం కొడుకుల చేతుల్లోకి పోయాక ఆయన మాట ఎవరూ ఖాతరు చేయడం లేదు. పెద్ద కొడుకు రామారావు ప్రైవేటు స్కూల్లో సైన్సు టీచర్. రెండో వాడు కిషోర్ బాంకులో అటెండర్. మూడో సంతానం కూతురు. వివాహమయింది. నాల్గోవాడు బియ్యే చదువుతున్నాడు. శేఖరయ్య భార్య చనిపోయి ఎనిమిదేళ్లయింది.

రెండేళ్ల క్రితం వరకు అతనికే వ్యాపకం లేదు. రికామీగా తిరుగుతున్న శేఖరయ్య తన తోటి వాళ్లు కొందరు రకరకాల ఊళ్లు తిరుగుతూ, జల్సా చేస్తూ కాలం గడపడం చేసి, వాళ్లను బతిమిలాడి ఆ రహస్యం తెలుసుకున్నాడు. ఆ తర్వాత వాళ్ల కాళ్లు , వీళ్ల కాళ్లు పట్టుకుని, ఓ పని చేశాడు. అప్పటి నుంచి అతని జీవన విధానమే మారిపోయింది.

★ ★ ★

ఎండాకాలం మండిపోతుంది.

ఉదయం ఎనిమిదింటికే వాతావరణం వేడెక్కి, ప్రజలు చెమటలు కక్కుతూన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్ కోలాహలంగా ఉంది. ఆ టైంలో విజయవాడవైపు వెళ్లే ప్రయాణీకులు కృష్ణా, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు; సికింద్రాబాద్ వైపు వెళ్లే వాళ్లు శాతవాహన కోసం ఎదురు చూస్తున్నారు.

పెళ్లిళ్ల సీజన్ కావడంతో విపరీతమైన రద్దీగా ఉంది. దానికి తోడు సీజన్ టికెట్ తీసుకుని ప్రతి రోజూ ప్రయాణించే ఉద్యోగులు, వ్యాపారస్తులతో రెండు ప్లాట్‌ఫాంలు క్రిక్కిరిసి ఉన్నాయి.

ఆదరాబాదరా రైల్వే స్టేషన్‌కు చేరుకున్న శేఖరయ్య, రెండు ట్రైనులూ వెళ్లలేదని తెలుసుకుని 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు.

సెకండ్ క్లాసు టిక్కెట్ కౌంటర్ల ముందున్న చాంతాడంత క్యూని చూస్తూ, గుట్కా పొట్లం విప్పి నోట్లో పోసుకుని, సిగిరెట్ వెలిగించి నిలబడ్డాడు.

"నమస్తే శేఖరన్నా ఎవర్ దొరకలేదానే" అంటూ కొరియర్ కుర్రాడు శేఖరయ్యను పలకరించాడు.

"అరే ఎందుకు దొరకర్రా! మనోళ్లందరు వస్తాన్రా?" నోట్లోని గుట్కాతో పాటు ఊరిన లాలాజలం క్రింద పడకుండా నోటిని వంకరగా పెట్టి ప్రశ్నించాడు.

"ఆ ఆ నీకో సీటుంచుతం లేవే" అంటూ అతను వెళ్లిపోయాడు.

ఇంతలో ఎడం చేతిలో ఓ లగ్జరీ సూట్‌కేసూ, కళ్లకు రేబాన్ గ్లాసులు పెట్టు కొని ఫస్ట్‌క్లాస్ కౌంటర్‌దగ్గరికొస్తున్న ఓ ఖరీదైన శాల్తీని గమనించాడు శేఖరయ్య. నోట్లోని గుట్కాను టికెట్ కౌంటరున్న గోడమీద తుపుక్కున ఉమ్మేసి సిగరెట్‌ను ఆర్పి లాల్చీజేబులో వేసికొని ,అతనికి దగ్గరగా జరిగాడు. కౌంటర్లోని బుకింగ్ క్లర్క్‌ను హెచ్చరిస్తున్నట్లుగా ఓ దగ్గు దగ్గాడు. ఆ సిగ్నల్‌ని రిసీవ్ చేసుకున్నట్లుగా అతనూ నవ్వాడు.

కౌంటర్ దగ్గరకు రాగానే "సికింద్రాబాద్‌కో ఎ.సి. చెయిర్‌కార్ టిక్కెట్ ప్లీజ్!" అని అడిగాడు ఆ ప్రయాణీకుడు.

"హౌమచ్?" అంటూ పర్స్‌లో నుంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి, చేతిలో పట్టుకొని ప్రశ్నించాడు.

"వన్ మినిట్" అంటూ బుకింగ్ క్లర్క్ తన సీటులోంచి లేచి పక్కకు నడిచాడు.

అతని వింత ప్రవర్తనకు ఆశ్చర్యపోతున్న ఫస్ట్‌క్లాస్ ప్రయాణీకుడు-

"నమస్తే సార్"అన్న మాటలు తన చెవి దగ్గర వినిపించగానే గిర్రుమని అటు తిరిగాడు. శేఖరయ్యను చూసి "ఏంది" అని అడిగాడు విస్తుబోతూ.

"సికింద్రాబాద్‌కి పోతాన్రా మీరు" అని ప్రశ్నించాడు, అమాయకంగా.

ఖద్దరు బట్టలు, మాసిన గడ్డం, దీనంగా ఉన్న శేఖరయ్యను ప్రశ్నార్థకంగా చూస్తూ

"ఔ. అయినా నీకెందుక్కు?" అన్నాడు చిరాకుగా.

"ఏం లేద్సార్. నేన్‌బీ సికింద్రాబాద్‌కే పోతున్న. నాకు నల్గుర్ పిల్లలు సార్. మా ఇంటోళ్లకు పానం బాగలేద్సార్. హైద్రాబాద్ ఉస్మానియాల షెరీక్ చేస్న. దాన్ని చూడనికే పోతున్న. నేను ఫ్రీడం ఫైటర్ని. నాకు ఫస్ట్‌క్లాస్ పాస్ ఉంది. నేను గాక ఇంకోల్లు కూడా నాతో రావచ్చును. మీకు ఫస్ట్ క్లాజ్ ఛార్జ్ నూటాభై అయితది సార్. నాకు సగం అంటే డెభై యిస్తే నాతోనే నిన్ను.. ఆహా. నీతోటినేనుగూడ వొస్త. పేదోణ్ణి, ఫ్రీడం ఫైటర్ని ఆదుకున్నట్టయితది సార్.' అన్నాడు శేఖరయ్య గుక్క తిప్పుకోకుండా, కొత్తవాళ్లతో మాట్లాడాల్సిన పాత డైలాగ్‌ను ఎక్కడా తప్పు దొర్లకుండా.

ఫస్ట్‌క్లాస్ ప్యాసెంజర్ పజిలయ్యాడు.

"ఉహుం. గిసుంటి లంపటం నాకెందుకు? ఆఫ్టాల్ ఫిఫ్టీ రూపీస్ కోసం - నీయమ్మ మధ్యల చెక్కయితే, స్క్వాడ్ ఒస్తె నాకు ప్రాబ్లం" అన్నాడు చికాగ్గా.

"లేదయ్యా! తమకేం ఇబ్బంది కల్గదు సార్. నీ లాంటి మారాజులకు డెభ్భై రూపాయలో లెక్కలోంది గాదు. గాని గా రూపాయలే నా పెండ్లానికి మందులు కొనిపిస్తయి సార్' అన్నాడు,

రానికన్నీళ్లను పంచెతో ఒత్తుకుంటూ.

ఇంతలో బుకింగ్ కౌంటర్లోకి క్లర్క్ వచ్చాడు. శేఖరయ్య వైపు కళ్లెగరేసి చూశాడు ఏమైంది అన్నట్లు.

శేఖరయ్య "చేప పడ్తుంది"అన్నట్లుగా కన్ను గీటాడు.

ఆ ప్రయాణీకుడు ఇబ్బందిగా చూశాడు.

కౌంటర్లోని క్లర్కు "ఏం ఫర్లేదు సార్. ఏదో బీదవాడు" అంటే తన వంతు సహాయం చేశాడు.

"ఊఁ, సరే! గీబ్యాగ్ పట్టుకొని పద" అంటూ దర్పంగా తన సూట్‌కేస్‌ను శేఖరయ్య అందించాడు.. అదే మహాప్రసాదం అన్నట్లు గా 'అయ్యో!'అంటూ ఆసూట్ కేసును అపురూపంగా అందుకున్నాడు శేఖరయ్య.

బుకింగ్ కౌంటర్లో నుంచి సైగ చేస్తున్న క్లర్కుకు నమస్తే పెట్టి, జేబులోనుంచి ఐదు రూపాయల నోటు తీసి అందించాడు శేఖరయ్య.

ఖరీదైన ఆ ప్రయాణీకుడి వెంటే, దాదాపురైల్వే కూలీలాగా సూట్‌కేస్ మోసుకుంటూ వెళుతున్న శేఖరయ్యని చాలా మందే పలకరించాడు.

"ఏ.సి.యా? సెకండా?' అని పలకరించిన నడియవస్కుడితో-

"ధూత్ సెకండ్ క్లాస్ కాదు ఏ.సి"! నవ్వుతో ముఖం చాట లాగ విచ్చుకోగా అని గర్వంగా, సైలెంట్‌గా - ప్రస్తుతానికి తన యజమాని అయిన ఆ వ్యక్తికి వినబడనంత తగ్గు స్వరంలో చెప్పాడు.

"నీయమ్మ! మంచి బేరమే పట్టావ్" అంటూ మెచ్చుకున్నట్టుగా అతని భుజాన్ని తట్టాడు అతని ఫ్రెండు.

"సీటాపూ. కాజీపేట తర్వాతొస్త" అంటూ అతన్ని హెచ్చరించాడు శేఖరయ్య.

★ ★ ★

ఏ.సీ. ఛైర్‌కార్లోకి ప్రవేశిస్తూనే, ట్రైన్ కండక్లర్‌కు రెండు చేతులెత్తి సమస్కరించాడు శేఖరయ్య.

"ఏం సంగతి?" అంటూ చిరాగ్గా ప్రశ్నించాడతను.

"అయ్యో! తమరి దయ. మా రిలేటివ్‌ను తీసుకొని సికింద్రాబాద్ పోతున్న" అని జేబులోంచి ఐదు రూపాయల నోటు తీసి కండక్టర్ చేతిలో పెట్టాడు .

"ఇంకో ఐదు" అన్నాడు నిర్మొహమాటంగా కండక్టర్.

"ఏదే ఉండె. కౌంటర్ల ఐదు, నీకు ఐదిచ్చిన. జేబులు ఖాళీ దొరా!" అన్నాడు శేఖరయ్య.

"ఖాళీనా. పది నిమిషాల్లో పడతయి గద. అందులోంచి ·ఇయ్యి. లేకపోతే కాజీపేటలో దించేస్త" అన్నాడు కండక్టర్.


శేఖరయ్య ఇచ్చిన ఫ్రీడం ఫైటర్ పాస్‌ని కోటుజేబులో వేసుకొని-


"ఐదిచ్చిన తర్వాతనే పాస్ వాపసిస్తా" అంటూ ముందుకు నడిచాడు.

"అయ్యో! తమరు కూర్చోండి సార్. ఇదంతా మామూలే మాకు. మీరు కూర్చోండి" సూట్‌కేస్ పైన కాబిన్లో పెట్టి, సీటు మీద లేని దుమ్మును కండువాతో దులుపుతూ అన్నాడు.

అతను కూర్చోగానే తనూ కొంచెం దూరంలో మరో సీట్ మీద కూర్చున్నాడు. ఆ కాస్త శ్రమకే అతని ముఖం నిండా చెమట పట్టింది. కండువాతో ముఖం తుడుచు కుంటూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

"సార్ డెబ్బై రూపాయలిస్తే పంద్రా రూపాయ్ ఖర్చు పోను యాభై ఐదు రూపాయలు మిగుల్తయి. పేకాట కోసం పచ్చీస్‌రూప్యేకన్న ఎక్కువ ఖర్చుపెట్ట. వస్తే నా లాభం వస్తది. లేకపోతే పచ్చీస్ ఖతం కాంగనే ఆట బంద్ చేస్త. బీస్ రూప్యా పెట్టి అల్ఫాల చికెన్ బిర్యాని తిననికి ఖర్చయితే రెండు గుట్కాలు, రెండు సార్లు ఛాయ్‌లు- కతం అక్కడికక్కడికి లెక్క కతమయితది. ఇంగ వొచ్చేటప్పుడు ఎవరైనా దొరికినా బీస్ రూపయ్






దాకా మిగుల్తయ్. లేదంటే, గేటు దగ్గరికి బండి రాంగనే ఛెయిన్ గుంజి ఆగంగానే బండి దిగితే, ఇంట్ల బడ్త అయిదు నిముషాలల్ల. తిని పంటె కతం. ఈరోజు గడుస్తది."

అలా ఆలోచిస్తుండగానే శేఖరయ్యకు మెరుపులాంటి మరో ఆలోచన వచ్చింది.

తన యజమాని-కం-ప్రయాణీకుడు స్టేషన్లో పర్స్‌లోనుంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి పట్టుకోవడం గుర్తొచ్చింది. తన దగ్గర ఎట్లానూ చిల్లర లేదు కాబట్టి, వంద రూపాయల నోటు గనుక అతనిస్తే అది తీసుకుని చిల్లర తర్వాత ఇస్తానని చెప్పి ఉడాయించొచ్చు. ఆ ఊహ రాగానే తన కుటిలపు ఆలోచనకు తనే నవ్వుకున్నాడు. శేఖరయ్య ఊహించినట్లుగానే ఆ ప్రయాణీకుడు వంద రూపాయల నోటిచ్చాడు అతనికి.

"చిల్లరెక్కడిది సార్! నాదగ్గర " అన్నాడు శేఖరయ్య దీనంగా ముఖంపెట్టి.

"దేవుడా దేవుడా ఫర్వలేదు ఉంచుకో అని అంటెనా నీకో కొబ్బరికాయ కొడ్త" అంటూ మనుసులోనే దేవుని క్కూడా లంచం ఆఫర్ చేస్తూ ఎదుటి వ్యక్తి నోట్లోంచి వచ్చే సమాధానం కోసం, క్షణ క్షణం గండంగా, ఎదురు చూస్తూ నిలబడ్డాడు.

ఆ వేళ శేఖరయ్య నక్కను తొక్కి వచ్చినట్టుంది.

"సరే ఉంచుకో" అనే మాట ఆ ప్రయాణీకుడి నోట్లోంచి రావడం ఆలశ్యం అతను మళ్లీ మనసు మార్చు కుంటాడేమోనని - అక్కణ్ణుంచి మాయమయ్యాడు.

రెండేళ్ళ క్రితం శేఖరయ్య చేసిన పనేమిటంటే స్వాతంత్ర్య సమర పోరాటంలో తను కూడా పాల్గొన్నాననే రికార్డులను, అతి ఖర్చుమీద, సృష్టించి ప్రభుత్వానికి సమర్పించీ, ప్రభుత్వాధికారులను సంతృప్తి పరిచీ, స్వాతంత్ర్య సమరయోధుల కిచ్చే అన్ని రాయితీలను సంపాదించాడు.

వాటిల్లో దేశంలో ఎక్కడికయినా సెంకడ్ క్లాస్ ఎ.సి.గానీ ఫస్ట్‌క్లాస్‌లోగానీ తనతోపాటు మరో అటెండెంట్‌ను తోడు పెట్టుకొని ప్రయాణం చేసే సౌకర్యం, సగం చార్జీలకే ప్రధాన్యతా కోటాలో ఒక టెలిఫోన్ కనెక్షన్, డిపాజిట్ లేకుడానే గ్యాస్ కనక్షనూ - వీటన్నింటితో పాటు పదిహేను వందల రూపాయల నెలసరి పెన్షన్.

శేఖరయ్య తనకు మొదటి నెల ఒచ్చిన పదిహేను వందల రూపాయల్లో వెయ్యి రూపాయలు ఇంట్లో తన భోజనం ఖర్చుకు గాను ఇచ్చాడు.

ఆ డబ్బులు ఇచ్చే ముందు, తనకు రెండు సార్లు కాఫీలు, రెండు పూటలా అతని ఒక్కడి కోసమైనా మాంసం కూర వండి పెట్టాలనీ; అతని బట్టలు ఉతకాలని; పడుకోవడానికి పక్క వేయాలనే షరతులు విధించాడు.

ఎట్లాగూ తండ్రే కదా తప్పేది కాదని, తప్పేమీ లేదని, ఈ గడ్డు రోజుల్లో వెయ్యి రూపాయల అదనపు ఆదాయం అంటే మాటలు కాదని, ఆ రూపాయల మీది ఆశతో కొడుకులు, కోడళ్లు అందుకు అంగీకరించారు.

కానీ వెయ్యి రూపాయలు ఇచ్చిన రోజు నుండీ ఇంట్లో అతని దాష్టీకం వాళ్లకు భరించనలవి అయ్యింది కాదు.

ఇన్ని రోజులు ఆ ఇంట్లో తనకు ఎదురయిన ఇల్ ట్రీట్‌మెంటుకు ప్రతీకారంగా అన్నట్లు ఆయన వాళ్లపై అధికారం చెలాయించడం ప్రారంభించాడు. అతను దొడ్లో కెళ్లేందుకు చెంబులో నీళ్లు కూడా సిద్ధం చేయాలన్నంతవరకు సాధించాడు.

ఒక్క నెల రోజుల్లోనే వాళ్లు అతన్ని హిరణ్యాక్ష వరాలను తీర్చలేక విసిగి వేసారి "నీకో దండం నీ వెయ్యి రూపాయలకో దండం" అనే నీరస స్థితికి వచ్చారు.

దాంతో శేఖరయ్య కూడా కొంచెం తగ్గాడు. తన పాలసీ మార్చుకున్నాడు. నెల కాగానే కొడుకుల చేతిలో వెయ్యి రూపాయలు పెట్టడం మానేశాడు. వాళ్లు కూడా అతన్ని అడగలేదు.

శేఖరయ్య అప్పుడో వంద , ఇప్పుడో వంద కోడళ్లకు ఇచ్చేవాడు. వాళ్ల సినిమాలకు పూలు, చిరుతిళ్ల ఖర్చులు ఈ విధంగా తీరడంతో మామగారిని ఆప్యాయంగా చూడడం మొదలుపెట్టారు. ఒకరికోసారి, ఇంకొకరికి మరోసారి ఓ వందో రెండొందలో పెట్టి చీరెలు కొనిచ్చేవాడు. నెలకు వెయ్యి రూపాయలు ఒకేసారి కొడుకులకు ఇచ్చిన దాని కన్నా ఈ పద్దతి మూలంగానే తనకు అదనపు సౌకర్యాలు, సుఖ శాంతులు లభిస్తాయని గ్రహించి దాన్నే అమల్లో పెట్టాడు.

ఫ్రీడం ఫైటర్ కోటాలో సగం ఛార్జీకే దొరికే టెలిఫోన్ సౌకర్యాన్ని తన తమ్ముడి కొడుకయిన ఓ బిజినెస్‌మాన్‌కి రెండు వేలకే అమ్మేశాడు. ఆ డబ్బులు పెట్టి ఇంటిల్లి పాదికి పండుగకు బట్టలు కుట్టించి మిగిలిన డబ్బులతో ఫుల్లుగా మందు కొట్టాడు.

డిపాజిట్ లేకుండా ఫ్రీగా వస్తున్న గ్యాస్ కనెక్షన్‌ను తన స్వంత కొడుకు దగ్గరే వెయ్యి రూపాయలు ముక్కు పిండి వసూలు చేసి, మూడు రోజులు నిద్రాహారాలు మాని క్లబ్బులో పేకాట ఆడి, ఆ డబ్బులు స్వాహా అని అన్పించాడు.

ఇది వరకు చెమటోడిస్తే కాని రూపాయి దొరకడం గగనమయిన వాడికి ఇబ్బడి ముబ్బడిగా డబ్బులు కన్పించేసరికి తాగుడు, పేకాట, గుట్కాలు అలవాటయ్యాయి. వచ్చిన డబ్బులు పెరిగిన జల్సాలకు ఏ మూలకు సరిపోకపోయేసరికి, ఓ కొత్త దారి పట్టాడు.

రోజా పొద్దున్నే ఇంట్లో సుష్టుగా భోం చేసి ఎనిమిది గంటలప్రాంతంలో రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం, పాసింజర్లెవరయినా దొరికితే వాళ్లను చల్లర్ల (చల్లటి+అరలో=ఎ.సి. కంపార్ట్‌మెంటులో) గమ్యస్థానం చేర్చే బాధ్యతను ఇవ్వాల్టి లాగే, స్వీకరించి అందుకుగాను లభించే డబ్బులతో పేకాడ్డం, భోజనం ,ఇతర సరదాలు తీర్చుకోవడం అలవాటు చేసుకున్నాడు.

జీవితం చాలా సుఖంగా, హాయిగా పూలతేరులాగా సాగుతుంది అతనికి.

★ ★ ★

ఎప్పటి మాదిరిగానే ఆ రోజు ప్రొద్దున్నే స్టేషన్‌కు చేరుకోగానే తెల్సిన వ్యక్తి ఒకడు శేఖరయ్య దగ్గరకొచ్చి "అన్నా! మంచి గిరాకీని తెచ్చిన. ఢిల్లీ. ఢిల్లీకి పోతవా? మూడు రోజులుండి మళ్లొచ్చుడే. సార్ ఆఫీస్ పని మీద బయట తిర్గుతడు. నువ్వు సుఖంగా అర్రబండిల మందు కొట్కుంట మజా చెయ్యొచ్చు. ఢిల్లీల ప్రొబిషన్ లేదు తెల్సు గద. ఖర్చంత సారే పెట్టుకుంటడు. వచ్చినంక రెండొందలు ఇస్తడు. ఏమంటవ్?"

"నీ యమ్మ లేవంగనె ఎవ్వరి ముఖం చూసిన్నో మంచి గిరాకీ దొరికింది. గీ ప్రొబిషనేందోగని నోటి తడి ఆర్తలేదు. కల్లుల కల్తీ నీ యమ్మ సారాల కల్తీ. గీన తోటి ఢిల్లీకి బోతే బార్డర్ దాటిన్నంటే సాలు ఒక హాఫ్, దించకుండ కొడ్త నీ యమ్మ" అని అనుకున్నాడు.

స్వేచ్ఛగా నీటైన మందు కొట్టొచ్చన్న ఆలోచనే అతనికి ఉత్సాహాన్నిస్తుంది. అందుకే సరేనన్నాడు.

"నా టెన్ పర్సెంట్ మాత్రం మర్వొద్దు" అని సార్‌ని పరిచయం చేశాడు.

"గీనే సార్ శేఖరయ్య. మా దోస్తు.జీ.టీ.ల పోయి రాండ్రి. మీరెన్ని రోజులుంటే గన్ని రోజులుంటడు. మీతోనే వస్తడు. జర ఖయాల్ చెయ్యండ్రి ముసలోణ్ని" అని తనిచ్చిన ఇర్వై రూపాయల నోటు తీసుకుని నమస్తే పెట్టాడు.

"అరే గదేంది భాయ్. మంచిగనే చూస్కుంట. ఇది మనకేమన్న కొత్తనా ఏంది?" అని అతనన్నాడు.

"జర మా ఇంట్ల చెప్తవా మరి" అని శేఖరయ్య. ఉత్సాహంగా మూడో ప్లాట్‌ఫాం వైపు నడిచాడు, సార్ బ్యాగ్ పట్టుకొని.

★ ★ ★

ఏ.సి. టూటైర్ కంపార్ట్‌మెంటులో సీట్లు దొరికాయి. శేఖరయ్య పక్కనే అతనితో వచ్చిన సార్ కూర్చున్నాడు.

వీళ్లతోపాటే వరంగల్ స్టేషన్లో ఎక్కిన ఓ తాతగారు, ఓ అమ్మాయి-వీళ్లకు ఎదురు సీట్లలోనే కూర్చున్నారు.

ట్రైన్ బయల్దేరగానే కండక్టర్, టికెట్ చెకింగ్ కోసం వచ్చాడు. శేఖరయ్య అతి వినయంగా పాస్ తీసి చూపించాడు. "మేమిద్దరం" అన్నట్లుగా తనతోపాటు ప్రక్కనున్న వ్యక్తిని చూపించాడు.

"ఎక్కడిదాకా?" అని కండక్టర్ గద్దించాడు.

"అయ్యా ఢిల్లీకి" అన్నాడు శేఖరయ్య.

"ఊఁ బలార్షాల దిగుత. కలువ్" అంటూ కండక్టర్ ఆర్డర్ వేశాడు.

"మంచిద్దొరా."

శేఖరయ్య పాస్ చెకింగ్ అయిన తర్వాత, వాళ్లకు ఎదురుగా కూర్చున్న వాళ్ల టిక్కెట్లు చూపించమని అడిగాడు.

ఆ తాతగారు పాస్ తీసి చూపించాడు.

"నీ యమ్మ అన్నీ పాసులె. అందరు ఫ్రీడం ఫైటర్లే. మీరంత ఉరికురికి తెల్లోల్లతోని కొట్లాడిన్రా" శేఖరాన్ని చూస్తూ అన్నాడు. శేఖరయ్య వెర్రి నవ్వు నవ్వాడు. కండక్టర్ తాతగారి వైపు తిరిగి "నువ్వెక్కడిదాకా?" అన్నాడు గదమాయిస్తున్నట్లుగా.

తాతగారి దగ్గర పాస్ తీసుకున్నాక ఫ్రీడం ఫైటర్ల గురించి చేసిన కామెంటు విన్న ఆ అమ్మాయి సమీర

"అంటే ఏమిటి మీ ఉద్దేశ్యం" అంది.

"ఆఁ" అని వెటకారంగా దీర్ఘం తీస్తూ.

"ఎక్కడిదాకా? అని అడుగుతుంటే వినబడ్త లేదా ఉద్దేశ్యం గిద్దేశ్యం అని అంటున్నవ్" అన్నాడు కండక్టర్ చిరాకుగా.

"ఎప్పుడో దేశం కోసం పోరాడినట్లు పైరవీలు చేసి ఫ్రీపాసులు పొంది, అవసరమున్నా లేకపోయినా ఎవరో ఒకర్ని వెంటేసుకొని ఫస్టు క్లాసుల్లో ప్రయాణించేవారు ఫ్రీడం ఫైటర్లు" అని ఆ కండక్టర్ యొక్క స్థిరమైన అభిప్రాయం. అందుకే వాళ్లను చిన్న చూపు చూస్తుంటాడు.

కానీ సమీరకు అతని అమర్యాదకరమైన ప్రవర్తనకు కారణం అర్థంకాక విస్తుబోయింది. తాతగారి ముందు తనను ఆ విధంగా తీసిపారేసినట్లుగా మాట్లాడుతుంటే, కోపం నెత్తికెక్కింది.

"ఏయ్ మిస్టర్! హోల్డ్ యువర్ టంగ్. పిచ్చి పిచ్చిగా వాగితే మర్యాదగా ఉండదు" అని హెచ్చరించింది. ఆ మాటలు విన్న శేఖరయ్య విస్తుపోయి చూశాడు.

పాసు మీద ప్రయాణం చేస్తూ, కండక్టర్లను అయ్యా అప్పా అని బతిమిలాడుకొని, ఏమైనా దక్షిణలు సమర్పించుకొని ప్రసన్నం చేసుకోవాలే గానీ "గిట్ల మాట్లాడతర ఎవరైన. గందుకే వాళ్లకు తిక్కబుడ్తది, దించేస్తరు. ఇప్పుడు వీళ్ల గతి కూడా గంతే. పాపం ముసలోణ్ని గూడా దించుతడు సార్" అని అనుకున్నాడు. సమీర మాటలు విన్న కండక్టర్ గంగవెర్రులెత్తాడు.


"మర్యాద గుండదా. ఏం చేస్తవ్. కొడ్తవా. నీ యమ్మ! సర్కారు సొమ్ము పుణ్యాని కొచ్చిందని రైళ్లల్ల తిరుగుడే కాక, నీ ముఖానికి ఏ.సి.ల కొచ్చి కూర్చొని మమ్మల్నే మాటలంటున్నవ్? ఏమను కుంటున్నవ్ నువ్వు జాన్సీకి రానీవా ఏంది నువ్వు. గీ ముసలోడు ఏమన్న గాంది మహాత్ముడా ఏంది? నీ యమ్మ! మంచిర్యాలల మీ ఇద్దర్ని దించి పోలీసులకు పట్టించకపోతే నేను మీసమున్న మొగోణ్నే కాదు" అంటూ రంకెలు వేశాడు.

ఆ అరుపులకు కంపార్ట్‌మెంటులోని ప్రయాణీకులంతా గుమిగూడి వింతగా చూస్తున్నారు.

ఎటు పోయి ఎటొస్తుందోనని, తన పాసు సంగతి బయట పడ్తుందోనని శేఖరయ్య గడగడ వణుకుతున్నాడు.

తాతగారు సమీర చెయ్యి పట్టుకొని "సమీరా ఉండు. నేను మాట్లాడుతానుగా. సంగతేమిటో నేను కనుక్కుంటానుగా" అంటూ వారిస్తున్నా వినకుండా సమీర ఉద్రేకంగా లేచింది.

"ఏంట్రా కుక్కా వాగుతున్నావ్. నువ్వు మమ్మల్ని పోలీసులకు పట్టించేదేమిట్రా? మంచిర్యాల తర్వాత నువ్వు నీ జన్మలో ఈ



ట్రైన్‌లో కాదు ఇంకే ట్రైన్‌లో కూడా కాలు పెట్టకుండా నేను చేస్తాను" అందీ గంభీరంగా.

ఆమె ఉద్రేకానికి కండక్టర్ భయపడ్డా, అది మనసులోనే దాచుకొని "సరే అదీ చూద్దాం" అంటూ బయటకు నడిచాడు.

'ఏంటి తాతయ్యా మనం చేసిన తప్పేంటి. ఈ రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే మీ పేరు చెబ్తే అందరూ లేచి నిలబడ్తారే. అట్లాంటిది మిమ్మల్ని ఈ అల్పుడు గేలి చేస్తుంటే నేనెలా సహించగలను' అంటూ ఏడ్చేసింది.

"సరే సరే శాంతించు! మీ డిపార్ట్‌మెంట్ వాళ్లేగా!" అని ఓ పది నిమిషాలపాటు కళ్లు మూసుకున్నాడు. తర్వాత

"పోరాటం నిరంతరం సాగుతూనే ఉండాలన్న మాట" అని స్వగతంగా అనుకున్నాడు.

★ ★ ★

మంచిర్యాల స్టేషన్ రాగానే తాతగారు, సమీర రైలు దిగేశారు. తన డిపార్ట్‌మెంటుకు చెందిన ఇతర అధికారులను తీసుకొని వచ్చిన కండక్టర్‌కు వాళ్ల సీట్లు ఖాళీగా కన్పించేసరికి, ఎదురుగా బిక్కుబిక్కుమంటూ కూర్చున్న శేఖరాన్ని చూసి-

"ఏరి?" అని ఎదురుసీటులోని వాళ్ల నుద్దేశ్యించి ప్రశ్నించాడు.

శేఖరయ్య "దిగి పోయిండ్రు" అన్నాడు.

కండక్టర్ ముఖంలో విజయగర్వం తొణికిసలాగింది" పిరికి ముండ. పారిపోయిండ్రన్న మాట! లేకపోతే నాతోనే పెట్టుకుంటుందా?" అని మీసం మెలేశాడు.

అందరూ సంతోషంగా క్యాంటిన్లో టీ తాగుతుండగా, జీ.టీ. ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ముందు గొడవ మొదలయ్యింది. "ట్రైన్ కింద ఎవరో పడిపోయారని" అరుస్తుంటే అందరూ అటువైపు పరిగెత్తారు.

కానీ అక్కడికి వెళ్లాక అక్కడి దృశ్యాన్ని చూసి, అంతకు ముందు విజయగర్వంతో వెలిగిన కండక్టర్ ముఖం మాడిపోయింది.

జి.టి.ఎక్స్‌ప్రెస్ ముందు పట్టాల మీద ట్రైన్ కదలడానికి వీల్లేకుండా తాతగారూ, సమీర బైటాయించారు. ట్రైన్ డ్రైవర్, అసిస్టెంట్లు అడుగుతున్న ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పకుండా మౌనంగా కూర్చున్నారు.


ఎవరికీ ఏం చేయాలో పాలుపోవడం లేదు.

అరగంట గడిచేసరికి, ఎండవేడికి తాతగారు సొమ్మసిల్లి పడిపోయాడు. ఈ గలాభా విని స్టేషన్ సూపర్నెంటు వచ్చాడు. ఆయన కూడా వాళ్లను మాట్లాడించడంలో విఫలమయ్యేసరికి, మెసేజ్ అందుకున్న డివిజనల్ మేనేజర్ పోలీసులతో సహా రంగ ప్రవేశం చేశాడు.

అప్పటికే రెండు గంటలయినా కూడా ట్రైన్ స్టార్ట్ కాకపోయేసరికి ప్రయాణీకుల గోల మొదలయింది. వాళ్లు, పోలీసులు, రైల్వే ఉద్యోగులతో ప్లాట్‌ఫాం కిటకిటలాడసాగింది.

డివిజనల్ మేనేజర్‌గారు తాతగారిని సమీరని చూసి విస్తుపోయారు. తాతగారిని ఎక్కడో చూసినట్లుగా, చాలా పరిచయమున్నట్లుగా అన్పించడం; సమీర పరిచయమున్న వ్యక్తిగా తోచడంతో అందర్నీ దూరంగా ఉండమని ఆదేశించి వారి దగ్గరకు నడుస్తుండగానే తాతగారెవరో గుర్తొచ్చింది. ఆనందోత్సాహంతో వారి దగ్గరకు నడిచి

"సార్ మీరు... తమరు సుప్రసన్నారావుగారు కదూ. స్వాతంత్ర సమరంలో పాల్గొని అండమాన్లో గడిపి వచ్చిన ఏకైక తెలుగు వ్యక్తి మీరే కదూ" అన్నాడు-అంతటి మహావ్యక్తిని చూస్తున్నానన్న ఆనందం, అతనేనా కాదా అన్న సంశయం, అతనే




అయి ఉంటాడనే నమ్మకం పెరుగుతూ, వారిలా, ఇక్కడ నిరసన చేస్తూ కూర్చోవలసి వచ్చినందుకు బాధ-మొదలైన భావాలన్నీ మనసులో కలగా పులగం కాగా తాతగారు అవునన్నట్లుగా తలూపాడు.

డి.యం.గారు "అయ్యో! మరి తమరేమిటి ఇలా! నా వల్లగానీ ,మా వారివల్లగానీ ఏదైనా తప్పు జరిగితే క్షమించండి. లేవండి. ఈ వయసులో తమరెందుకిలా క్షోభ పడ్తున్నారు" అంటూ వారి పాదాలకు నమస్కరించి, రెండు భుజాల క్రింద చేతులు వేసి లేవబోయాడు.

తాతగారు "ఆగు బాబు" అన్నాడు.

డి.యం.గారు, సమీర వైపు తిరిగి "అయితే నువ్వు సమీరవై ఉంటావు. యామై కరెక్ట్. సివిల్స్ సెలక్టయి . ఐ. ఆర్. టి. ఎస్ వచ్చిందని పేపర్లో రాశారు. నిజమేనా" అన్నారు. అవునన్నట్లుగా సమీర తలూపింది.

"మరేమిటిది. నౌ యూ ఆరే పార్ట్ ఆఫ్ రైల్వేస్. అసలేం జరిగింది?" అని కొంచెం దర్పంగా ప్రశ్నించాడు.

సమీర, ట్రైన్ కండక్టర్ దురుసు ప్రవర్తన గురించి చెప్పింది. మంచిర్యాలలో తమను దించేసి పోలీసులకు అప్పచెప్తానన్న విషయం వింటున్నపుడు డి.యం.గారి భృకుటి ముడిపడింది.

తన పి.ఏ.ని పిల్చి 'ఆ కండక్టర్‌ను పిలవండి' అని చెప్పేలోగానే, ఆ కండక్టర్ ముందుకొచ్చి

"నేనే సార్" అని అన్నాడు లోగొంతుకలో.

"యూ బ్లడీ ఫూల్. బెర్తులమ్ముకోవడానికి అలవాటుపడి బొజ్జలు పెంచి, ఎవరితో ఏం మాట్లాడాలో తెలీడం లేదురా మీకు. క్వొయిక్లి ఉన్నావ్. ఇడియట్. యూ ఆర్ సస్పెండెడ్ విత్ ఇమ్మీడియెట్ ఎఫెక్ట్. నీ ఛార్జి సెకెండ్ కండక్టర్‌కు హాండోవర్ చేసెయ్. గెటౌట్. నా కళ్ల ముందు నిలబడకు. వెళ్లు" అని అరిచాడు.

"సార్" అంటూ అందరి ముందూ డి.యం. గారి కాళ్లు పట్టుకున్నాడు.

'నథింగ్ డూయింగ్. యూ ఆర్ సస్పెండెడ్' అంటూ కఠినంగా ఆదేశించాడు. తాతగారు అతన్ని ఆగమన్నట్లుగా వారించాడు.

"అతను, తన తప్పు తెల్సుకుంటే చాలు. పెద్దశిక్ష వద్దు" అంటూ అక్కణ్నుంచి లేచి నిలబడ్డాడు. కండక్టర్ భేషజాలన్ని మరిచి తాతగారి కాళ్ల మీద పడ్డాడు. సమీర వైపు తిరిగి "క్షమించడమ్మా!" అంటూ కళ్ల నీళ్ల పర్యంతం అయ్యాడు.

రైలు బయల్దేరడం ఆలస్యం అవుతుందని తెలియగానే, శేఖరయ్య స్టేషన్ దాటి ఓ సందులో దూరి, బార్డర్ ఏరియా కాబట్టి, విచ్చలవిడిగా లభిస్తున్న మందు ఓ క్వార్టర్ లాగించి ప్లాట్‌ఫారం మీదకు వచ్చేసరికి, కండక్టర్ తాతగారి కళ్ల ముందు మోకరిల్లి ఉండడం కనబడింది.

"అరే దొరా గదేం పని. గీ ముసలోడి కాళ్లు పట్టుకుంటున్నవెందుకు?" అని తూలుతూ ముందుకు రాబోయాడు. డి.యం.గారు కోపంగా చూడటంతో రైల్వే పోలీసులు శేఖరయ్యను పట్టుకున్నారు. చేదు మాత్ర మింగినట్టుగా మారిన ఆ సంఘటనతో, ఫ్రీడం ఫైటర్ అన్న పేరుకే కళంకం తెస్తుంటే మనో మంజూషలో పదిలపర్చుకున్న ఓ మధుర భావనకు, ఎవరో పని గట్టుకొని మలినం పూసినట్టుగా సమీర మనసు భారమయింది. రైలు సాగిపోతూనే ఉంది. ●